## కామెడీ కథ

# మిసెస్ 2ంత్ర



**ఎండాకాలంలో ఎండలతోపాటే కూరల ధరలూ మండిపోతాయి. సగం కూరలు ఎండిపోయి దర్శనమిస్తే మిగిలిన కొన్ని కూరలు మార్కెట్లోంచి మాయమైపోతాయి. పుల్లేటి కుర్ర నుంచి వచ్చిన తల్లిని పొద్దున్నే స్టేషన్ నుంచి తీసుకొచ్చి ఇంట్లో దింపి చొక్కలింగం మార్కెట్‌కి వెళ్లాడు కూరలు తేవడానికి.**

''అయ్యో... అబ్బాయ్ లింగం... అదేంట్రా అన్ని కూరలు మోసుకొచ్చావు... నెలకి సరిపడా ఒక్కసారే తెచ్చావేంట్రా... చొక్కా ఎలా తడిసిపోయిందో చెమటతో''

రొప్పుతూ, రొజుతూ ఆటోలోంచి నాలుగు సంచులు చెరో చేతిలో రెండేసి చొప్పున మోసుకుంటూ లోపలికి వచ్చాడు చొక్కలింగం.

''ఫ్యాన్ వెయ్యవే...'' కావమ్మ కసురుకుంది కోడల్ని.

''ఇదిగో ఈ సంచులు నీవి. వీటి జోలికి వచ్చావంటే ఊర్కునేదిలేదు.''

చొక్కలింగం భార్య కావ్య వైపు కొరకొరా చూస్తూ అన్నాడు.

కొత్తగా పెళ్లయిన కొడుకు కాపురం చూద్దామని పుల్లేటికుర్రు నుంచి పొద్దున్నే వచ్చిన కావమ్మ కలవరపడిపోయింది చొక్కలింగం మాటలకి, చేతలకి.

''నీ సంచులు... నా సంచులు ఏంట్రా... పెళ్లయిన మూడు నెలలకే నీ పెళ్లి పెటాకులయిపోయిందా?. అపుడే వంటలు వేరయ్యాయా?. ఇదేం ఖర్మ దేవుడో. రేపు ఊళ్లో నేనెలా తలెత్తుకోనూ. అందరితో ఏమని చెప్పుకోనూ.'' కావమ్మ స్వరం అంచెలంచెలుగా స్థాయి పెరుగుతూ పై షడ్జమాన్ని చేరుకోబోతూంటే చొక్కలింగం కసురుకున్నాడు.

''అమ్మా... తగ్గించు సౌండు... ఇదేం పుల్లేటికుర్రు అనుకున్నావా. వీధి అంతా ఇంటి ముందు పోగయిపోతుంది నీ అరుపులకి''

''అరవక ఏం చెయ్యనురా తండ్రీ. నీ కాపురం ఇలా తగలబడితేనూ...''

''కాపురం ఏం తగలబడలేదు బాగానే ఉంది. నీ నోటికే వచ్చింది కష్టమంతా? కమ్మగా కూర అన్నం తిని ఎన్నాళ్లయిందో...''

''అయ్యో అదేంట్రా నాయనా పిల్లకి శుభ్రంగా వంట చేయుడం వచ్చు అన్నారే వాళ్లవాళ్లు. ఉండు వెళ్లి వాళ్లని కడిగేస్తాను.''

''వాళ్లని తర్వాత కడుగుదువుగానీ ఇప్పుడు మొదట ఆ వంకాయలు కడిగి కొత్తిమీర కారం పెట్టి కూర వండిపెట్టు. ఎన్నాళ్లయిందో తిని.''

చొక్కలింగం నాలిక తడుపుకుంటూ అన్నాడు.

కావ్య కూరలు తరిగి ఇచ్చి కావల్సినవి అందిస్తూంటే కావమ్మ వంట పూర్తి చేసింది.

''ఏమ్మా కావ్యా అబ్బాయికి తిండి యావ ఎక్కువ. చక్కగా రెండు పూటలా కూర, పులుసు, పచ్చడి రుచిగా చేసిపెట్టాలని చెప్పానా? ఇంటి పట్టునే ఉంటున్నావు కదా. మరి కూర కూడా చెయ్యకుండా ఏం చేస్తున్నావు?'' కావమ్మ కోడల్ని మెత్తగా మందలించింది.

''కూరలు ఉన్నప్పుడు చేస్తున్నాను అత్తయ్యా... లేకపోతే ఎలా చేస్తానూ.'' కావ్య మెల్లిగా జవాబిచ్చింది.

''అయిపోవడమేమిటి... అన్నేసి కూరలు తెస్తేనూ. నే వచ్చాకనే కూరలన్నీ తెచ్చాడా ఏంటి. ఏరా అబ్బాయ్ లింగం... నువ్వు కూరలు తేకుండా అమ్మాయి వంట ఎలా చేస్తుంది. నీ నోట్లోకి కూర ఎలా వస్తుంది... కూర తిని ఎన్నాళ్లయిందో అంటున్నావు వెధవాని...''

చొక్కలింగం భగభగమండిపోయాడు. ''నేను కూరలు తేవటం లేదని ఎవరు చెప్పారు? వారం వారం చేతులు విరిగేలా మోసుకొస్తున్నాను.'' కావ్యవైపు కొరకొరా చూస్తూ అన్నాడు చొక్కలింగం.

''మీ ఇద్దరి వరసా నాకర్థం కావడం లేదు. కోడలేమో కూరలుంటే చేస్తున్నాను అంటోంది. నువ్వేమో చేతులు విరిగేలా సంచులు మోసుకొస్తున్నాను అంటున్నావు. మరి కూరలన్నీ ఎక్కడ మాయమవుతున్నాయి.''

''నీ కోడల్నే అడుగు ఆ సంగతి''

''ఏమ్మా కావ్యా! నువ్వయినా విషయమేంటో చెప్పు''

కావ్య మాట్లాడకుండా చొక్కలింగానికి పెరుగు వడ్డిస్తోంది.

''ఆవిడగారేం చెప్పదు. నే చెప్తా విను... నేను తెచ్చే పళ్లు, కూరలూ అన్నీ గుజ్జు చేసేసి మొహానికి రాసేసుకుంటుంది. పాల మీగడ నాకెంత ఇష్టమో... అంతా ఒంటికి పులిమేసుకుని స్నానం చేస్తుంది.'' చొక్కలింగం భోజనం ముగించి బెడ్రూమ్ వైపు వెళ్తూ అన్నాడు.

''అయ్యో... అయ్యో... అదేం మాయ రోగం...''

''బ్యూటీ రోగం నీ కోడలిని పట్టుకుంది...''

ఎంత పల్లెటూరిదైనా కావమ్మగారికి బాగానే అర్థమయింది. ఈమధ్య పల్లెటూరి అమ్మాయిలు కూడా పెళ్లికి ముందు, పెళ్లిచూపుల ముందు పక్కనున్న టౌన్‌కి వెళ్లి జుట్లు కత్తిరించుకుని, మొహం మెరవడానికి ఏవో మాలిష్‌లు చేయించుకుంటారని వింది.

''అమ్మాయ్ కావ్యా... అందం లేని వాళ్లకి ఆ పాట్లన్నీ. నీకెందుకమ్మా ఈ గోలంతా అప్సరసలా ఉన్నావు. అదీ గాక పెళ్లయిపోయింది కూడానూ...''

''అదికాదత్తయ్యా... పెళ్లయిన వాళ్లు కూడా వెళ్లొచ్చు. ఈయనకి చెప్తే వినటం లేదు. మీరైనా చెప్పండి...''

చాలా రోజుల తర్వాత కూర, పప్పు, పులుసు, పచ్చడితో సుష్టు పూర్తిగా భోజనం లాగించిన చొక్కలింగానికి కళ్లు మూసుకుపోతూంటే పక్కమీదకి వాలిపోయాడు.


★ ★ ★

చొక్కలింగానికి పెళ్లయి ఇరవై రోజులు అయింది. పదహారోజుల పండగ ఊళ్లో ముగించుకుని భార్య కావ్యతో హైదరాబాద్ వచ్చేశాడు. ఇంకా వారం రోజులు సెలవు ఉండడంతో ఇల్లు సర్దుకుని... సాయంత్రాలు అలా సినిమాలకి, షికార్లకీ తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. కొత్త దాంపత్యాన్ని తనివి తీరా ఆస్వాదిస్తూ...

ఆరోజు అలాగే సాలార్‌జంగ్ మ్యూజియం చూసి హోటల్లో టిఫిన్ తిని అబిడ్స్ సెంటర్‌లో అలా నడుస్తూ విండో షాపింగ్ చేస్తున్నారు. చొక్కలింగానికి కావ్యకేదైనా గిఫ్ట్ కొని ఇవ్వాలనిపించింది. పర్సులో పర్వాలేదు చిన్న కోరికలు తీర్చేంత డబ్బు ఉంది.

''కావ్యా... నీకేం కావాలో చెప్పు. నీకేదైనా కొనివ్వాలని ఉంది.''

కావ్య అటూ ఇటూ చూసింది బట్టలషాపులు, నగలు, వెండి షాపులు... ఎలక్ట్రానిక్స్ షాపులు. వీధికి రెండు వైపులా ఏవేవో షాపులు ఉన్నాయి. కావ్య చాలా సేపు అటూ ఇటూ చూసి ఆఖరికి




ఎమ్. నాగలక్ష్మి

ఓ షాపు వైపు వేలు పెట్టి చూపించింది.

'పెర్‌ఫెక్ట్ మ్యాచింగ్ సెంటర్'. కట్‌పీసెస్, బ్లౌజ్‌లు అమ్మే షాపు అది. కావ్య చీర కూడా కోరుకోకుండా ఇంత చిన్న కోరికతో సరిపెట్టుకోవడం చొక్కాలింగానికి ముచ్చటేసింది. 'మరీ ఇంత చిన్న కోరికా... పాపం కొత్త కదూ అడగడానికి మొహమాటపడ్తోంది.' మురిపెంగా అనుకున్నాడు.

''కావ్యా బ్లౌజ్‌పీస్ ఎలాగూ తీసుకుందాం. ముందు ఓ మంచి చీర కొనుక్కో. అక్కడ చూడు 'అపూర్వ శారీ ఎంపోరియం'ట అందులో చీరలు చుద్దామా'' కావ్య వద్దన్నట్టు తలాడించి మళ్లీ ఆ షాపులోకే వెళ్దామన్నట్టు వేలు పెట్టి చూపించింది. ఈసారి కావ్య వేలు చూపిస్తున్న వైపు చూసిన చొక్కాలింగానికి చెమటలు పోశాయి. అక్కడ నీరెండలో తళుక్కున మెరుస్తోంది 'శారదా బ్యూటీ పార్లర్' అన్న బోర్డు. పెర్‌ఫెక్ట్ మ్యాచింగ్ సెంటర్‌పైన ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉందా షాపు.

''ఒంటికి దురద... ఐ మీన్ డబ్బు... ఉన్న వాళ్లకే ఈ పార్లర్స్ అన్నీ... బ్యూటీ పార్లర్ కాదు... లూటీ పార్లర్... అయినా బ్యూటీ లేని వాళ్లు అందులోకి వెళ్తారు. నీకెందుకు చెప్పు...''

''కాదండీ... అక్కడ హెయిర్ సెట్ చేసి.. మొహం ఇంకా అందంగా మెరిసిపోయేట్టు చేస్తారు'' పొడవాటి తన జుట్టువైపు విచారంగా చూసుకుంటూ అంది కావ్య.

''పర్సు తేలికయ్యేట్టు చేస్తారు. అందులోకి వెళ్లడం రికరింగ్ డిసీజ్ లాంటిది. ఓసారి వెళ్తే మాటిమాటికీ హెయిర్ సెట్టింగ్‌లకి... బ్లీచింగ్ సిట్టింగులకీ వెళ్లాల్సి వస్తుంది. పద...పద... ఆ ఒక్కటీ తప్ప ఇంకేవైనా...'' యమధర్మరాజు సావిత్రికి వరాలిస్తున్న స్టైల్లో అన్నాడు.

కావ్య తనకేమీ వద్దంది. చొక్కాలింగం కాస్త గిల్టీగా ఫీలయ్యాడు. భార్య మొదటి కోర్కెనే కాదన్నందుకు. మెల్లిగా నడుస్తున్న చొక్కాలింగం దృష్టి పక్కనే ఉన్న పుస్తకాల షాపుమీద పడింది. వారపత్రికలు రెండు, మాసపత్రికలు రెండు కొన్నాడు. ''కావ్యా ఈ పుస్తకాలు చదువుకో లోకజ్ఞానం పెరుగుతుంది. లోకం పోకడ అర్థమవుతుంది...కథలు, కావ్యాలు ఉంటాయి.'' ఇంక తన నోట్లో కాకరకాయే అని, తన కడుపు మీద తనే కొట్టుకుంటున్నానని చొక్కాలింగం తెలుసుకోలేకపోయాడు ఆ క్షణంలో.

కావ్యకి పుస్తకాలంటే ఎలర్జీ. అవి క్లాసు పుస్తకాలయినా సరే. నవలలయినా సరే కడుపులోంచి వికారం వచ్చేస్తుంది. పదో తరగతి నాలుగుసార్లు తప్పి ఇంక చదవలేక వదిలేసింది కావ్య. మర్నాడు మధ్యాహ్నం టీవీ బోరు భరించలేక, ఏం చెయ్యాలో తోచక కొట్టుకుంటున్న కావ్య పాపం చొక్కాలింగం బోలెడు డబ్బులు పోసి కొన్నాడు కదా అని అనాసక్తిగా వారపత్రికలు తిప్పింది. అందులో ఉన్న బ్యూటీ టిప్స్, అందానికి చిట్కాలు కావ్యని అయస్కాంతంలా ఆకర్షించాయి. అంతే...మర్నాటి నుంచీ పాలు, మీగడ, కూరలు, పళ్లు, తేనె అన్నీ కావ్య ఒంటిమీద మాయమయిపోవడం మొదలైంది. చొక్కాలింగం

దుంపకూరలు, ఆకుకూరలు తినడు. బెండ కాయ, కాకరకాయ తప్ప మిగతా ఏ కూరనైనా, పండునైనా కావ్య తన సౌందర్య పోషణార్థం ఉప యోగించుకుంటుందని తెలియడానికి చొక్కాలింగానికి ఓ నెల పట్టింది.

★ ★ ★

తల్లి వచ్చిందని, అన్నావదినలతో కొన్నాళ్లు గడపచ్చుని ఏడాది క్రితమే పెళ్లయిన చొక్కాలింగం చెల్లెలు సీత పూనా నుంచి వచ్చింది. వారం రోజులు సందడిగా గడిచిపోయాయి.

ఓ రోజు సాయంత్రం ఇంటికొచ్చిన చొక్కాలింగానికి టేబుల్ నిండా ఖరీదైన క్రీములు, స్నోలు, కాంపాక్ట్ పౌడర్, మస్కారాలు కనిపించి మతిపోయింది.

''అమ్మా...'' తల్లి ఎదురుగానే ఉన్నా గట్టిగా అరిచాడు.

''ఎందుకురా లింగం అలా అరుస్తావు...''

''ఇవన్నీ ఏంటీ?'' చొక్కాలింగానికి నోట్లోంచి మాట రావడం లేదు. ఖర్చుకి ఉంటాయి ఉంచుకో అని తల్లికిచ్చిన మూడు వేలల్లో మూడొంతులు హారతి కర్పూరంలా హరించిపోయిందని అర్థమైపోయింది.

**హ్యాపీతా హాబీ**

**హ్యాపీతాభట్ మొన్నామధ్య వాసు భగ్నానీ కొత్త చిత్రం 'అవుట్ ఆఫ్ కంట్రోల్‌' షూటింగ్ నిమిత్తమై స్విట్జర్లాండ్, న్యూజెర్సీ ప్రాంతాల్ని సందర్శించింది. 'నాకు పుస్తకాలు చదవడమంటే చచ్చేంత ఇష్టం. విదేశాలకెళ్లినప్పుడు బుక్స్ కొని తెచ్చుకుంటుంటాను. ఆటోబయోగ్రఫీలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, సాహసగాథలు, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాల్ని బాగా చదువుతాను. షూటింగ్ గ్యాప్‌లో నా చేతిలో ఏదో పుస్తకం ఉండాల్సిందే' అని చెప్పే హ్యాపీతా మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తోంది.**

''చిన్నవాళ్లు... సరదాపడ్డారు... అయినా ఈ రోజుల్లో ఇవన్నీ అందరూ రాసుకుంటున్నార్రా...''

''కాస్త మట్టి, మశానం కూడా రాసుకోమను''

''ఆ...అదీ తెచ్చుకున్నారు... అదేం మట్టమ్మా... పాకిస్తానం మట్టి...''

''ముల్తానీ మట్టి అత్తయ్యగారూ'' కావ్య సరిదిద్దింది వినయంగా.

చొక్కాలింగం జుట్టు పీక్కున్నాడు. ''వీళ్లకీ పిచ్చేంటి... ఇద్దరూ ఎర్రగా, బుర్రగా బాగానే ఉన్నారుగా. ఇంకా ఇవన్నీ ఎందుకు?''

''ఏదో వాళ్ల సరదా... వెళ్లనీరా...''



''ఎక్కడికి వెళ్లనిచ్చేది... ఇద్దరూ వెళ్లి హుస్సేన్ సాగర్లో దూకుతారా?''

''ఛీ అశుభం మాటలు నువ్వునూ...''

''అన్నయ్యా మిసెస్ 2003 పెడుతున్నారట 'ఆ' టీవీ వాళ్లు.. ఈ వీధిలో కాస్త అందంగా ఉన్నవాళ్లందరూ పోటీకి వెళ్తున్నారు.''

''మీరు కూడా ఆ ఊరేగింపులో ఊరేగుతారా.'' చొక్కాలింగం వెటకారంగా అన్నాడు.

''నా కోడలు, కూతురు బంగారు బొమ్మలు. లక్ష రూపాయలు బహుమానంట వెళ్లనీరా.''

''ఆ బహుమానమేదో మనకే వస్తున్నట్టు మాట్లాడతావేం నువ్వు కూడా'' చొక్కాలింగం తల్లిమీద ఎగిరాడు.

''అన్నయ్యా అందరికీ గిఫ్ట్ హేంపర్ ఇస్తారుట.'' సీత గారంగా అంది.

సీతకి ఎలాగైనా ఓసారి టీవీ తెరకెక్కాలన్న కోరిక.

అత్తగారు, ఆడపడుచు చొక్కాలింగానికి మాలిష్ చేస్తుండడంతో కావ్య బుద్ధిమంతురాల్లా కూర్చుంది మాట్లాడకుండా.

''గిఫ్ట్ హేంపర్ కాదు హేమర్ నెత్తినేసి కొట్టుకోవడానికి పనికొస్తుంది''

ముగ్గురాడవాళ్లు ఒక్కటయ్యి చొక్కాలింగం రుసరుసలు, చిటపటలు పట్టించుకోలేదు.

రెండు రోజుల తర్వాత ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చిన చొక్కాలింగం కళ్లకి సీత, కావ్య కొత్తగా కనిపించారు. ఆ మార్పేమిటా అని ఆలోచిస్తున్న చొక్కాలింగం గుండె గుభేల్మంది. మోకాళ్ల దాకా ఉండే కావ్య జుట్టు జానెడు తగ్గింది. నడుందాకా ఉండే సీత జుట్టు భుజాలకెక్కింది. ఇద్దరి కనుబొమ్మలు హరివిల్లుల్లా కత్తిరించి ఉన్నాయి.

''అమ్మా...''

''బ్యూటీ ఆస్పత్రికి వెళ్లొచ్చారురా... చిన్నపిల్లలు వాళ్ల సరదా వాళ్లది.''

క్లినిక్‌కి కావమ్మగారి పరిభాషలో ఆస్పత్రి అని అర్థం. సీతకి చీర కొనుక్కోమని ఇచ్చిన రెండు వేలూ కూడా ఎగిరిపోయాయని అర్థమయింది చొక్కాలింగానికి. అంతే కాదు పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చిందని అర్థమైపోయింది ఆకు కూరలు దుంప కూరలు విస్తట్లో పడుతూంటే.

నెల్లాళ్ల తరువాత మూడుసార్లు బ్యూటీపార్లర్ విజిట్స్ తర్వాత ఆరోజే కాంపిటీషన్ అంటు నీట్‌గా మంచి చీరలు కట్టుకుని తయారైపోయారు కావ్య, సీత. చొక్కాలింగాన్ని రమ్మని ఎంత బతిమాలినా 'నో' అని మొండికేయడంతో కావమ్మగారే బయల్దేరింది వాళ్లతో.

''అక్కడికెళ్లి స్విమ్ సూట్లు, బికినీ డ్రెస్సుల వేసుకుని పెరేడ్‌లో నిల్చుంటారా?'' చొక్కాలింగానికి అనుమానమొచ్చింది.

''ఛీ...ఛీ... అలాంటివేం ఉండవు అన్నయ్యా, కాసేపు స్టేజిమీద ఓ రౌండ్ తిరిగి కన్పించాలంతే. అయినా ప్రిలిమ్స్ అయిపోయాయి. ఇవ్వాళ ఫైనల్... రెండుసార్లు రిహర్సల్స్ కూడా చేయించారు.''

చొక్కాలింగం 'అమ్మయ్య పర్వాలేదు ఇదేదో సంసారపక్షం కాంపిటీషన్ అయితే' అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

★ ★ ★

''దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు బహుమానాలన్నీ వాళ్లల్లో వాళ్లే పంచుకున్నార్రా... పోటీకి వచ్చింది ఒక్కర్తీ తీరుగా లేదు తాడిలా అంతెత్తు ఉన్నదానికి లక్ష రూపాయల బహుమానం ఇచ్చారు. ఏడాది క్రితం అన్న తిన్నట్టున్న బక్కపీనుక్కి యాభై వేలు. వీళ్లింత కళగా ఉన్నా వాళ్ల కళ్లకి ఆనలేదు. కావమ్మ వెనక్కి వచ్చినప్పటి నుంచీ వాపోతూ ఉంది, సణుగుతూనే ఉంది.

''అందాల పోటీలంటే మొహం కళగా ఉందా అని ఒక్కటే చూడరు... హైట్... బరువు అన్నీ దృష్టిలో పెట్టుకుంటారు. అయినా అందరికీ గిఫ్ట్ హేంపర్‌లు ఇస్తారు అన్నారుగా''

సీత చొక్కాలింగం చేతిలో రెండు కాగితం ముక్కలు పెట్టింది. వెయ్యి మి.లీ.షాంపూ హెయిర్ ఆయిల్ ఫ్రీగా వస్తుంది. వాటితో వాళ్ళు రాసిన షాప్‌కెళ్లి తెచ్చుకుంటే.

''ఇంకేం... ఇంక రోజూ తలంట్లోసుకుని మిగిలిన జుట్టు కూడా ఊడకొట్టుకోండి.'' చొక్కాలింగం వేళాకోళంగా అన్నాడు.